క్లుప్తంగా

అధికారులకు సన్మానం



జనగామ: జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి ఇటీవల యాదాద్రి జిల్లాకు బదిలీ కాగా, సరస్వతి ఇక్కడకు వచ్చారు. శనివారం బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పజ్జూరి జయహరి, వర్కింగ్ ప్రసిడెంట్ కానుగంటి ముత్తయ్య, కోశాధికారి మర్యాల వెంకన్న, దాస నర్సయ్య, మాశెట్టి వెంకన్న, గాదె శ్రీనివాస్, రామయ్య ఆధ్వర్యంలో వరంగల్ ఎఫ్‌సీఐ డీఎం ప్రకార్‌వర్మ, ఏసీఎస్‌ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్‌తో పాటు వారిని సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీటీలు శ్రీనివాస్, దేవ తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు..



జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన చీటూరి లక్ష్మి కుమారుడు జయంత్ బాబు ప్రతిష్టాత్మక వరంగల్ నిట్ నుంచి సాంకేతిక విద్యలో డాక్టరేట్ పట్టా పొందాడు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అంబాల ఆంజనేయలు శనివారం జయంత్‌తోపాటు అతని తల్లిని శాలువాతో ఘనంగా సన్మానించారు. వరంగల్ నిట్‌లో ఉన్నత విద్యలో డాక్టరేట్ పొందడం పెంబర్తి గ్రామానికి గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బండ్రు సిద్ధులు, గోలుసుల దుర్గాచలం, సంకటి యాదగిరి, రాము, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



రఘునాథపల్లి : మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఖిలాషాపూర్ నుంచి జాఫర్ గూడెం వెళ్లే దారి గుంతలమయంగా మారి నడవడానికి వీలు లేకుండా పోయిందని విన్నవించారు. దీంతో స్పందించిన కడియం డీఈకి ఫోన్ చేసి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు కోసం రూ. 3 లక్షల వరకు ఖర్చు చేయాలన్నారు. అదే విధంగా శాశ్వత పరిష్కారం కోసం ఎస్టిమేషన్ వేసి ఎంత ఖర్చు అవుతుందో తెలియజేయాలని ఫోన్ ద్వారా సూచించారు. మాజీ జెడ్పీటీసీ మారజోడు రాంబాబు, గదె రమేశ్, అల్లిబిల్లి నర్సయ్య, యాదగిరి, మల్లేషం, రాజు ఉన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



జనగామ: జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో హనుమకొండ నుంచి రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామానికి విద్యార్థి గాదెపాక వర్షిత్ శనివారం ప్రయాణం చేసే సమయయంలో తన పర్సును పోగొట్టుకున్నాడు. నిడిగొండ స్టేజీ వద్ద దిగిన తర్వాత జేబులో పర్సు కనిపించక పోవడంతో వెంటనే జనగామ డిపో ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించాడు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, కంట్రోలర్ డీపీరెడ్డి, కానిస్టేబుల్ రాజశేఖర్ బస్సు నంబర్ తెలుసుకుని కండక్టర్, డ్రైవర్‌ను అలర్ట్ చేశారు. తాను కూర్చున్న సీటు కింద పడిపోయిన పర్సును తీసుకుని అధికారులకు అప్పగించగా, వారు విద్యార్థి వర్షిత్‌కు అందజేశారు. అధికారులు, ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పర్సులో నగదుతో పాటు విలువైన కార్డులు ఉన్నట్లు తెలిపాడు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

చిల్పూరు: గత మూడున్నర ఏళ్ల క్రితం పెద నాన్న కొడుకులతో జరిగిన గొడవలో తలకు తీవ్ర గాయమైన నాగరాజు చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య శారద పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు వివరాలను పోలీసులు తెలిపారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన ఊరడి నాగరాజు(29) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటినుంచో అతని పెదనాన్న కుమారులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు కాగా ప్రస్తుతం కోర్టులో ఉంది. 2021 జనవరి 7వ తేదీన జరిగిన గొడవలో నాగరాజును పెద నాన్న కుమారులు శ్రీనివాస్, శ్రీహరి తలపై బలంగా కొట్టారు. దీంతో అప్పటి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకురాగా శనివారం నాగరాజు మృతి చెందాడు. తన భర్త చావుకు శ్రీనివాస్,శ్రీహరి కారణమని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొంది. కాగా, తహసీల్దార్ సరస్వతి శవ పంచనామా చేయగా ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కేసున మోదు చేశారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



స్టేషన్‌ఘన్‌పూర్: అన్నదానం చేస్తున్న బజరంగ్‌దళ్ ఉత్సవ కమిటీ బాధ్యులు



నర్మెట: పూజలో పాల్గొన్న డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎస్సై నగేష్



జనగామ: బాలాజీనగర్ వినాయక మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపారాధన



స్టేషన్‌ఘన్‌పూర్: పూజలో పాల్గొన్న ఏసీపీ భీమ్‌శర్మ తదితరులు

వినాయక నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. వాడ వాడలా ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు భక్తులచే పూజలందుకుంటున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు ప్రసాద వితరణలు, అన్నదానాలు స్వీకరించి బొజ్జగణపయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



జనగామ: వీవర్స్ కాలనీలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: కుర్మవాడ శ్రీ సాయి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గరిక పూజ చేస్తున్న భక్తులు



లింగాలఘణపురం: అన్నదానం చేస్తున్న మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి తదితరులు



జనగామ: 18వ వార్డు వాసవీ కాలనీఫేస్-2లో..



జఫర్‌గఢ్: శాకంబరీ అలంకరణలో గణనాథుడు



శివునిపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద..



దేవరుప్పుల: మన్‌పహాడ్‌లో గణేశుడికి మొక్కులు చెల్లించుకున్న ఝాన్సీరెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్టీసీ కాలనీలో గౌరీ పూజ నిర్వహిస్తున్న మహిళలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో ఎంపీడీఓ విజయశ్రీ తదితరులు



దేవరుప్పుల: కడవెండి అభయాంజనేయ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



జఫర్‌గఢ్: కూనూర్‌లో బుర్రకథ చెబుతున్న కళాకారులు



నర్మెట: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు



చిల్పూరు: అన్నదానం చేస్తున్న ఎస్సై నవీన్‌కుమార్ తదితరులు



బచ్చన్నపేటలో..

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలకుర్తి టౌన్: హైదరాబాద్ కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి తెలంగణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పెరు పెడతామని సీఎం ప్రకటన చేయడాన్ని హర్షిస్తూ శనివారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఐలమ్మ వారసులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ వారసులు చిట్యాల స్వేత సంపత్, రామచంద్రం, సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర రాపోలు సత్యనారాయణ, యాకాంతరావు, సోమయ్య పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లేరోడ్డుపై ప్రమాదకరంగా పెద్ద గుంతలు ఏర్పడగా గమనించిన స్థానిక పోలీసులు శనివారం పూడ్చివేయించారు. ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ ఆదేశాల మేరకు సీఐ జి.వేణు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతల్లో మొరం పోయించి పూడ్చివేయించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఘన్‌పూర్-కొత్తపల్లి బీటీ రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. కాగా, వాటిని గమనించిన సీఐ మానవతాదృక్పథంతో మొరం మట్టితో గుంతలను పూడ్చివేయించడంతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీసీలు శ్రీను, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

దేవరుప్పుల: తమ పరిసరాల్లో లభించే నిర్దేశిత పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్య చేకూరుతుందని ఎంఎల్‌హెచ్‌పీ జెసికా సూచించారు. రామరాజుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా శనివారం పోషకాహార ఆవశ్యకతను తెలిపే వస్తువుల ప్రదర్శనతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుజానా, కవిత, అంగన్‌వాడీ టీచర్లు సవిత, సంధ్య. ఆశ పద్మ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో..

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందని డాక్టర్ శరత్ అన్నారు. మండలంలోని లింగంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు కమల, రమ పాల్గొన్నారు.

క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి



స్పోర్ట్స్ మీట్ రన్‌లో విద్యార్థులు



బాలయేసులో స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ఝాన్సీరెడ్డి, చిత్రంలో డీఈఓ రాము తదితరులు

దేవరుప్పుల: క్రీడలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, హెచ్‌ఆర్‌జే ట్రస్టు చైర్‌పర్సన్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డీఈఓ రాము అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అధ్యక్షతన స్పోర్ట్స్‌మీట్-24కు ముఖ్యఅతిథులుగా వారు హాజరై జాతీయ, క్రీడా జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడా విద్యతో మానసిక, నైతిక, శారీరక అభివృద్ధి చెంది ఆశించిన లక్ష్యం చేరేందుకు దోహద పడుతుందన్నారు. అనంతరం సీనియర్స్ రన్నింగ్ పోటీల్లో విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం మిగితా క్రీడా విజేతలకు ఫాదర్ దిలిప్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కాసారపు ధర్మారెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కృష్ణ, ఉపాధ్యాయులు ఖాజా, మదన్ మోహన్, అనిత, విజయలక్ష్మి, మాధవి, మహేష్, అశ్విని, షభానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రమాదకరమైన విద్యుత్ స్తంభం మార్పు



కొడకండ్ల: మండలకేంద్రంలోని శివాలయంకు వెళ్లే దారిలో రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్నటువంటి విద్యుత్ స్తంభాన్ని శనివారం విద్యుత్ అధికారులు మార్చారు. రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం శీర్షికన ఆగస్టు 29న సాక్షిలో అటెన్షన్ ప్లీజ్ పేరిట ప్రచురించగా స్థానిక ఏఈ రాములు స్పందించి మధ్యలో ఉన్నటువంటి విద్యుత్ స్తంభాన్ని రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పక్కకు మార్పించారు.

పాస్టర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి: మండల కేంద్రంలో పాస్టర్ల సంఘం నియోజకవర్గం కోఆర్డినేటర్ బాలస్వామి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుపెల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా గందమాల డానియేల్, జనరల్ సెక్రటరీగా సుకుమార్, జాయింట్ సెక్రటరీగా వెంకట్, కోశాధికారిగా థామస్ ఎన్నికయ్యారు.

పాఠశాలకు స్ప్రేయర్ అందజేత



జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి బాలుర మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలకు బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు బానోత్ రాంకోటి శనివారం స్ప్రేయర్, గడ్డి మందును అందజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్, కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పాల్గొన్నారు.

సంతాపం

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన బుర్రకథ, యక్షగాన కళాకారుడు తీగల కొమురయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వృద్ధాప్యం ముంచుకొచ్చిన కొమురయ్య ఏ ఇంట యజమాని స్థాయి వ్యక్తులు మృతి చెందితే తన కళారూపాలచే ఆ కుటుంబాల జీవిత గాథలను స్మరణ కొలిచి దుఃఖాన్ని మైమరిపించే కళాకారుడి దుర్మరణం పట్ల పలువురు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమయ్య, యాదగిరి, దయాకర్ గౌడ్, భిక్షపతి, యాదగిరి, సోమయ్య ఉన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు

జనగామ రూరల్: సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అలాగే గానుగుపహడ్, ఎర్రగొల్లపహడ్, వడ్లకొండ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన విద్యార్థి కొడారి రాజ్‌కుమార్ రైలు కింద పడి మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

ఓబులాపూర్‌లో..

మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన వంగాల దయాకర్ కుమార్తె వంగాల తణుశ్రీ డెంగీ జ్వరంతో మృతి చెందింది. కాగా విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు చిన్నారి కుటుంబాన్ని శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల సాయం అందజేశారు.

వేలం వాయిదా

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం కల్యాణమండంలో శనివారం కొబ్బరి కాయలు, పూజ సమగ్రి (అభిసేకం, వాహన పూజ సామగ్రి మినహాయించి) తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం సీల్డ్ టెండర్‌ కం బహిరంగ వేలం నిర్వహించగా సరైన పాటరాక పోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు. తిరిగి ఈనెల 27న శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

సామూహిక నిమజ్జనం చేపట్టాలి

లింగాలఘణపురం: ఈ నెల 16న మండలంలోని నెల్లుట్ల చెరువులో నిర్వహించే గణేశ్ నిమజ్జనాలను సామూహికంగా చేపట్టాలని జిల్లా సమరసత కన్వీనర్ గుజ్జుల కుమారస్వామి కోరారు. నెల్లుట్ల చెరువులో చేపడుతున్న నిమజ్జన ఏర్పాట్లను ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. శాంతియుతంగా గణేశ్ నిమజ్జనం చేయాలన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు రామకృష్ణ, బాలనారాయణ, స్వామి, శివ, అరుణ్‌కుమార్, హిందు వాహినీ అధ్యక్షుడు రాకేశ్ ఉన్నారు.

భక్తిభావంతో నిమజ్జనం చేయాలి

చిల్పూరు: భక్తిభావంతో వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. గ్రామాల్లో 9వ రోజు నిమజ్జనం చేసే వినాయకుల విగ్రహాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగ ఎస్సై మాట్లాడుతూ నిమజ్జనం అయ్యే వరకు ఎవరైనా మద్యం తాగితే చర్యలు తప్పవని అన్నారు. నిమజ్జనానికి డీజేలకు అనుమతి లేదన్నారు. ఆయన వెంట పోలేపల్లి రంజిత్‌రెడ్డి, కర్నకంటి స్వప్న వెంకటేష్, ఏదునూరి రవీందర్, కండ్లకోలు బాలరాజు, ఊమ్లానాయక్ ఉన్నారు.

నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు

స్టేషన్‌ఘన్‌పూర్: గణేశ్ నిమజ్జనంలో డీజేలకు పర్మిషన్ లేదని, డీజే యజమానులు సహకరించాలని సీఐ జి.వేణు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో ఉన్న డీజే యజమానులతో సీఐ సమావేశం నిర్వహించి రెండు రోజులు డీజేలకు అనుమతి లేదన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



జనగామ రూరల్: యేసు క్రీస్తు బోధనలు, ఆయన మార్గం అనుసరణీయమని పాస్టర్ రాజా హెబెల్ అన్నారు. మండలంలోని ఎల్లంల గ్రామంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో కొటారీ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం 9వ వార్షికోత్సవ ఉజ్జీవ కూడికల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రీస్తు చేసిన సేవలు, ఆయన అనురించిన మార్గంను తెలియజేశారు. అనంతరం సంఘం ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. మోజెస్, ఫిలిప్, ప్రభాకర్, ఏలియా పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొరం పనులు



మొరం పోయిస్తున్న రజాక్‌యాదవ్

స్టేషన్‌ఘన్‌పూర్: తాను చిన్నతనంలో చదువుకున్న పాఠశాలకు తనవంతుగా ఏదైనా చేయాలనే తలంపుతో మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పురమాని రజాక్‌యాదవ్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.40వేలతో మొరంపోయించాడు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ ఎగుడుదిగుడుగా అధ్వానంగా ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలతో నీరు ఆవరణలో నిలిచి చిన్నపాటి కుంటను తలపించింది. దాంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ చిన్నారులు, అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రజాక్‌యాదవ్ తన సొంత ఖర్చుతో శనివారం మొరం పోయించి డోజర్‌లో చదును చేయించారు. పాఠశాల ఆవరణను మాజీ ఎంపీటీసీ బాగు చేయడంపై విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

స్టేషన్‌ఘన్‌పూర్: సమాజంలో ప్రతీ ఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ ఎన్‌సీసీ అధికారి ఆర్.శాంతి, ఎన్‌సీసీ మాజీ అధికారి కె.ప్రకాశం అన్నారు. ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులతో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రథమచికిత్స ఎంతో అవసరమన్నారు. ప్రథమ చికిత్స ప్రధాన లక్ష్యం ప్రాణాలను రక్షించడం, ఆరోగ్యం మరింత క్షీణించకుండా నిరోధించడమని, సమీపంలోని ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తరలించడమన్నారు. సకాలంలో ప్రథమ చికిత్స అందించడం ద్వారా చాలా ప్రయోజనం ఉంటుందని అన్నారు.

'మహాలక్ష్మి' లబ్ధిదారులకు అర్హత పత్రాల పంపిణీ



జనగామ: గ్యాస్ పత్రాలు అందజేస్తున్న రాంచందర్

జనగామ: పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ గాదెపాక రాంచందర్ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా శనివారం వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అర్హత పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ సుమతి, ప్రశాంతి, కళ్యాణం లింగం పాల్గొన్నారు. కాగా, 30వ వార్డులో కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు గ్యాస్ పత్రాలను అందించారు.ఆర్పి శాంత, సమాఖ్య అధ్యక్షురాలు విజయ పాల్గొన్నారు.

చేతల ప్రభుత్వం కాంగ్రెస్

నర్మెట: మేనిఫెస్టోలో పొందుపరిచిన ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని, కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను శనివారం మహిళలకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెవుల పరశురాములు, ప్రజ్ఞాపురం శ్రీధర్, కొన్నె అంజనేయులు, వంగాల గోవర్ధన్, తీగుళ్ల భూపతి రెడ్డి, వడపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలోని మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను ఎంపీడీఓ మల్లికార్జున్ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రేషన్‌షాపులో ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 గ్యాస్ సిలిండర్‌కు ఎంపికైన లబ్ధిదారకుల సంబంధించిన పేపర్లను పంపిణీ చేశారు. రేషన్ డీలర్ రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో దుంపలి సంపత్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ సుకన్య కోటేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి నిరంజన్‌రెడ్డి, కమ్మగాని శ్రీకాంత్, భాగాల నవీన్ రెడ్డి, ఐరేని రామారావు తదతరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న విజేందర్

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ కోరారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆయన శనివారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో వైద్యం కోసం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించడంతోపాటు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. బెల్లంకొండ వెంకటేష్, మిన్నాలపురం ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.